సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 27 । జూన్ । 2024



యాంత్రీకరణతో దిగుబడులు

ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రంతో విత్తన ప్రక్రియ సులువుగా మారింది. ఒకేసారి ఎరువులు, విత్తనాలు వేసే వీలు కలిగింది.

- 8లో



రైలు నుంచి జారిపడి..

తాళ్లభద్ర రైల్వేగేటు వద్ద ఓ యువకుడు రైలు నుంచి జారిపడ్డాడు. తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

- 8లో

29న ఐటీడీఏలో జాబ్‌మేళా

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో ఈ నెల 29న కె.ఎల్. గ్రూప్, అమెజాన్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి జాబ్ మేళా నిర్వహించనున్నట్టు పీఓ విష్ణుచరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై సమీపంలోని ఫ్యాక్టరీ వద్ద ప్యాకింగ్, స్కానింగ్, స్టోరింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ ఉద్యోగాల్లో పనిచేయడానికి పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. నెలకు రూ.16 వేల నుంచి రూ.18 వేల మధ్య వేతనం ఉంటుందన్నారు. వారానికి 5 రోజుల పనిదినాలు ఉంటాయని చెప్పారు.

న్యూస్‌రీల్

గురుకుల పాఠశాల తనిఖీ



భోజనాలను పరిశీలిస్తున్న జిల్లా సమన్వయాధికారి బాలాజీ

పాతపట్నం: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళిక తయారు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ అన్నారు. పాతపట్నం మండలం ప్రహరాజపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ వి.అర్చన, తామరపల్లి, దుప్పలవలస ప్రిన్సిపాళ్లు ఆర్.వి.కృష్ణతార, బి.బుచ్చిరాజులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో మిగులు సీట్లు 2782



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని ఐటీఐలు (పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు)ల్లో ప్రవేశాలకు నిర్వహించిన కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసింది. మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ఈ నెల 18 నుంచి 23 వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగులు సీట్లు, హాజరు కాని విద్యార్థులకు మంగళ, బుధవారాల్లో కౌన్సెలింగ్ చేపట్టారు. చివరి రోజు 161 మంది హాజరు కాగా 140 మందికి సీట్లు కేటాయించారు. మొత్తం 3608 సీట్లకు గాను 826 మందికి ప్రవేశాలు కల్పించారు. 2782 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రెండో విడత కౌన్సెలింగ్‌కు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రిన్సిపాల్, ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరరావు, శిక్షణకులు వెంకటరమణ పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో రామ్‌తేజ్‌కు స్వర్ణం



నిహాల్ రామ్‌తేజ్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో జిల్లాకు చెందిన చెటికం నిహాల్ రామ్‌తేజ్ సత్తాచాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 24న విజయవాడ శాతవాహన కళాశాల వేదికగా జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో అండర్ -10 ఇండియన్ రౌండ్ విభాగంలో రామ్‌తేజ బంగారు పతకం కైవసం చేసుకున్నాడని అరసవల్లిలోని ఆదిత్య ఆర్చరీ అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ చెటికం రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ పోటీల్లో అకాడమీ తరఫున 15 మంది పాల్గొన్నట్టు చెప్పారు. వీరిలో బద్రి ప్రసాద్ తేజ, బలగ భానుప్రసాద్, గుణపర్తి గుణశేఖర్, బాలా మోక్షజ్ఞ ఆదిత్య, కుప్పిలి దేవీచరణ్ మెరుగైన ఆటతీరుతో ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. వీరిని ఆర్చరీ సంఘ జిల్లా కార్యదర్శి ఎల్.చిట్టిబాబు, ఒలింపిక్, పీఈటీ సంఘ ప్రతినిధులు అభినందించారు.

గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి



కొప్పలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీపీఓ వెంకటేశ్వర్లు

రణస్థలం: గ్రామాల్లో పారిశుద్ధ్యం, రక్షిత తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. కోష్ట పంచాయతీ పల్లెపేటలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా మురుగు, వ్యర్థాలు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. తాగునీటి కుళాయిలు, బావుల వద్ద ఎప్పటికప్పుడు బ్లీచింగ్ వేయించాలని సూచించారు. పంచాయతీల్లో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, ఈవోపీఆర్డీ ఎ.ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తును మనమే చిత్తు చేద్దాం

'సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్‌ను తరిమికొడదాం. మనల్ని చిత్తు చేయాలని చూస్తున్న మత్తును మనమే చిత్తు చేద్దాం..' అంటూ యువత, విద్యార్థి లోకం నినదించాయి. సైకిల్ ర్యాలీలు, ఫ్లాష్ మాబ్‌లు, లఘు చిత్ర ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాల ద్వారా మాదక ద్రవ్యాలపై తమకున్న వ్యతిరేకతను చాటిచెప్పారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా మొత్తం మత్తుకు వ్యతిరేకంగా మూకుమ్మడిగా నినదించింది.



- ఆకట్టుకున్న అవగాహన కార్యక్రమాలు
- డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా సదస్సులు
- ఆలోచింపజేసిన లఘుచిత్ర ప్రదర్శనలు
- ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ, ఫ్లాష్‌మాబ్‌లు

శ్రీకాకుళం క్రైమ్ : మాదక ద్రవ్యాలు వినియోగించడం నేరమని, యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని, ప్రతి పౌరుడూ వీటి నియంత్రణలో భాగస్వామి కావాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో పలు కళాశాలల విద్యార్థుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల వాడకం మన శరీరంలో వైరస్‌లా వ్యాప్తి చెందుతుందని, వీటికి దూరంగా ఉండాలని హితవుపలికారు. 2022 నుంచి రాష్ట్రంలో 4500 ఎన్డీపీఎస్ కేసులు నమోదు కాగా జిల్లాలో 55 నమోదయ్యాయని చెప్పారు. చదువుకునే యువత ఇలాంటి కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగావకాశాలు కోల్పోతారని, జీవితం నాశనమవుతుందని తెలిపారు. పిల్లలకే కాక తల్లిదండ్రులకు కూడా కౌన్సిలింగ్ ఇస్తే ఫలితముంటుందని, ఉపాధ్యాయులు, సైక్రియాటిస్టులు, సమాజంలో ఉండే ప్రతీ ఒక్కరూ సమష్టిగా మాదకద్రవ్యాల వ్యతిరేకతకు కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

- అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.ప్రేమ్‌కాజల్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ రవాణా జరుగుతుందని, అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. సెబ్ అదనపు ఎస్పీ (జేడీ) డి.గంగాధరం మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. మాదకద్రవ్యాల క్రయ విక్రయాలు, రవాణా జరిగినట్టు సమాచారం తెలిస్తే 14500 (ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబర్)కు సమాచారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులు, పోలీసులు కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ యర్రగుంట శృతి, సీఐలు ఉమామహేశ్వరరావు, సన్యాసినాయుడు, గోపాలకృష్ణ., ఎస్ఐలు హరికృష్ణ, కామేశ్వరరావు, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.



● సైకిల్ ర్యాలీ

శ్రీకాకుళం క్రైమ్ : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం ఆరుగంటలకు ఎస్పీ రాధిక ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడురోడ్ల కూడలి వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల వద్ద తెలియని వ్యక్తులు చాక్లెట్లు, ఇతర వస్తువులు ఇస్తే స్వీకరించరాదని, అలా ఎవరైనా చేస్తే డయల్ 100, 112, 14500కు సమాచారం అందించాలని కోరారు.



జోష్ శివ టీమ్ డ్యాన్స్

● ఫ్లాష్‌మాబ్ అదరహో

శ్రీకాకుళం క్రైమ్ : ఫ్లాష్ మాబ్ డ్యాన్స్ షోతో పట్టణ యువకులు అదరహో అనిపించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు వివరిస్తూ జోష్ శివ అండ్ టీమ్ శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలిలో వినూత్నంగా చేసిన డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్పీ రాధిక ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రదర్శన తిలకించారు. అనంతరం జోష్ శివ టీం సభ్యులకు జ్ఞాపికలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో ఫ్లెక్సీలను ప్రదర్శిస్తున్న సెబ్ అధికారులు

● డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

శ్రీకాకుళం అర్బన్: మాదక ద్రవ్యాలతో బాల్యం ఛిద్రమవుతున్న సంఘటనలు కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, వీటిని నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు, సమాజాన్ని ప్రభావితం చేసే వ్యక్తులతో సదస్సులు, సమావేశాలు, సైకాలజిస్టులతో ప్రత్యేక తరగతులు నిర్వహించి అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

● లఘుచిత్ర ప్రదర్శనలు

శ్రీకాకుళం క్రైమ్ : బాపూజీ కళామందిర్‌లో లఘు చిత్రాలు, నాటికలను ప్రదర్శించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ 16 షార్ట్ ఫిలిమ్స్ పోటీలో పాల్గొన్నాయి. వీరిలో శ్రీకాకుళం నగరానికి చెందిన పి.రోహిత్ టీమ్ ప్రథమ బహుమతి కింద రూ. 5 వేలు, రణస్థలం గ్రామానికి చెందిన ఆర్.రమణ టీమ్ ద్వితీయ బహుమతి కింద రూ. 3 వేలు ఎస్పీ చేతుల మీదుగా అందుకున్నారు. మత్తు పదార్థాలకు లోనై చైన్ స్నాచింగ్, ఇతర నేరాలకు పాల్పడటం, యువతులు చాక్లెట్లు రూపంలో ఉండే డ్రగ్స్‌కు బానిసలై ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొంటారన్నదానిపై నాటికలు ప్రదర్శించారు.



నాటికతో అవగాహన కల్పిస్తూ..



లఘుచిత్రాల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న రోహిత్ టీమ్

మాదకద్రవ్యాల క్రయ విక్రయాలు, రవాణా పై సమాచారం ఇవ్వాలంటే.. ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబర్ 14500 పోలీస్ 100 / 112

1 నుంచి డయేరియా డ్రైవ్



డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి: జిల్లాలో జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు 'స్టాప్ డయేరియా' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామాల్లోనూ ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీల బృందం ఇంటింటికీ వెళ్లి ప్రత్యేకంగా సర్వే చేయనున్నారని చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లల వివరాలు నమోదు చేస్తారని పేర్కొన్నారు. డయేరియా లక్షణమైన విరేచనాలను నియంత్రించేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్, జింక్ మాత్రలు అందజేస్తారని వివరించారు. డయేరియా ప్రభావిత గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపడతారన్నారు. ప్రతి పీహెచ్‌సీలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం, 10 మంది అధికారులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డయారియా నియంత్రణకు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో 24 గంటలూ అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

టెట్‌లో తోలాపి వాసికి స్టేట్‌ఫస్ట్ ర్యాంక్



శేషాద్రినాయుడు

పొందూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన టెట్ ఫలితాల్లో పొందూరు మండలం తోలాపి గ్రామానికి చెందిన అన్నెపు శేషాద్రినాయుడుకు 150 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఈయన 2020-22లో వమరవల్లి ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణాకేంద్రంలో ఉపాధ్యాయ విద్య అభ్యసించారు. తండ్రి ధర్మారావు, తల్లి జగదాంబలు ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఈయన విజయం పట్ల తోలాపి సర్పంచ్ ప్రతినిధి పప్పల రాధాకృష్ణ, ఎంపీటీసీ కళ్యాణి, మాజీ ఎంపీటీసీ పప్పల అప్పలనాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు నేనుసైతం..

- బీహార్ నుంచి కాశ్మీర్ వరకు సైకిల్‌యాత్ర చేపట్టిన యువకుడు
- 107 రోజుల పాటు కొనసాగనున్న యాత్ర



జాతీయ రహదారిపై సైకిల్ యాత్ర చేస్తున్న మహమ్మద్ రైహాన్ రజా

కంచిలి: రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టాలని ఆకాంక్షిస్తూ, పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరుతూ బీహార్‌కు చెందిన మహమ్మద్ రైహాన్ రజా సైకిల్ యాత్ర చేపట్టారు. దీనిలో భాగంగా బుధవారం జాతీయ రహదారి మీదుగా కంచిలిలో మక్కా మసీదుకు చేరుకున్నాడు. అక్కడ నమాజ్ చేసిన అనంతరం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. మే 11న బీహార్ రాష్ట్రం మధేపురాలో సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. 11 రాష్ట్రాల్లో 107 రోజులపాటు కాశ్మీర్ వరకు యాత్ర కొనసాగిస్తానని చెప్పారు. రెండో విడత నార్త్ ఈస్ట్‌కు ఆగస్టు 6న యాత్ర ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా కాలుష్య నిర్మూలనపై తన వంతుగా ప్రచారం చేసి ప్రజల అలవాట్లలో మార్పు తీసుకురావాలని ఇటువంటి ప్రయత్నానికి పూనుకున్నట్లు వివరించారు. ఇతనిని కంచిలి మక్కా మసీదు నిర్వాహకుడు తాజుద్దీన్ ఖాన్ ఆశ్రయం కల్పించారు.

● అన్నదాతకు మద్దతుగా..



- వరి మద్దతు ధర రూ.117 పెంచిన కేంద్రం
- జిల్లాలో 4,50,000 ఎకరాల్లో వరిసాగు
- ఏడాదికి సగటున 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

కవిటి: కేంద్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు అందించింది. వరి, గోధుమ, తృణధాన్యాలు తదితర 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ-మినిమమ్ సపోర్ట్ ప్రైస్)లను ప్రకటించింది. రానున్న ఖరీఫ్ సీజన్ 2024-25కు పెంచిన ధరలు అమలులోకి వస్తాయని తెలిపింది. వరి సాధారణ రకం క్వింటాలుకు రూ.2300, వరి గ్రేడ్-ఏ రకానికి రూ.2320గా నిర్ణయించింది. 2018లో పేర్కొన్న కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనల్లో భాగంగా ఈ పెంపును అమల్లోకి తీసుకువచ్చినట్టు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సీఏసీపీ) సిఫారసుల మేరకు 14 రకాల పంటలకు ఖరీఫ్‌లో కనీస మద్దతు ధర పెంపునకు కేంద్రం ఇటీవల ఆమోదం తెలిపింది. గతంతో పోలిస్తే మద్దతు ధర పెరుగుదల 5.35 శాతం కింద క్వింటాలుకు రూ.117గా లెక్కించారు. గత ఏడాది వరి క్వింటాలు రూ.2183 ఉండగా తాజా పెంపు తర్వాత రూ.2300కు సాధారణ రకం కొనుగోలు చేయనున్నారు. ఇక తృణ ధాన్యాలు విషయానికి వస్తే మద్దతు ధర పెరుగుదల భారీగానే ఉంది. ప్రధానంగా నువ్వులు రూ.637, పొద్దు తిరుగుడు రూ.520, కందులు రూ.550, రాగులు రూ.444 వంతున క్వింటాలుకు గత ఏడాది కన్నా అధికంగా ఎంఎస్పీలో పెరుగుదల నమోదు శుభపరిణామంగా అన్నదాత భావిస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలైన తృణ ధాన్యాల సాగు అనుకూలత ఉంది. ఈ తరుణంలో సీఎస్పీల పెంపుతో తృణధాన్యాల సాగుపట్ల రైతులు దృష్టి సారించే అవకాశముంది. తద్వారా జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల కారణంగా అధిక ఆదాయంతో జిల్లా జీడీపీ పెరుగుదలకు అవకాశం ఉంటుంది. జిల్లాలో సుమారు 4,50,000 ఎకరాల్లో వరి, తృణ ధాన్యాలు సాగవుతున్నాయి. ప్రధానంగా జిల్లాలో ఏటా సగటున 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగుతుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 5.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. తాజాగా మద్దతు ధర పెంపు కారణంగా గరిష్టంగా ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి.



దిగుబడులు కీలకం



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల పెంపు రైతాంగానికి మేలు చేకూర్చే అంశం. ఈ నేపథ్యంలో రైతన్నలు ఆధునిక వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా నాణ్యతా ప్రమాణాలు గరిష్టస్థాయిలో ఉండేలా పంట ఉత్పత్తుల సాధన వైపు దృష్టి సారించాలి. మిశ్రమ వ్యవసాయ విధానాలతో గరిష్ట ప్రయోజనం దక్కుతుంది. – డాక్టర్ కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

పంట	2024-25 (ఎంఎస్పీ)	2023-24 (ఎంఎస్పీ)	పెంపు
వరి(సాధారణ)	2300	2183	117
వరి(ఏ-గ్రేడ్)	2320	2203	117
సజ్జలు	2625	2500	125
జొన్నలు	3371	2180	191
రాగులు	4290	3846	444
మొక్కజొన్న	2225	2090	135
కందులు	7550	7000	550
పెసలు	8682	8558	124
మినుములు	7400	6950	450
వేరుశెనగ	6783	6377	406
పొద్దుతిరుగుడు	7280	6760	520
సోయాబీన్	4892	4600	292
నువ్వులు	9267	8635	632
నైగర్‌సీడ్	8717	7734	983
పత్తి	7521	7020	502

ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీలో.. 42.84 శాతం ఉత్తీర్ణత



ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ఫస్టియర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఫెయిలైన వారితో పాటు మార్కులు పెంచుకునేందుకు(ఇంప్రూవ్‌మెంట్) కూడా విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. 30 మండలాల నుంచి జనరల్ కోర్సుల విభాగంలో 42.84 శాతం, ఒకేషనల్ విభాగంలో 51.03 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. జనరల్ విభాగంలో 7113 మందికి గాను 3047 మంది, ఒకేషనల్‌లో 341 మందికి గాను 174 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇటీవల వెలువడిన ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 7431 మందికి గాను 65.37 శాతం ఉత్తీర్ణతతో 4857 మంది ఉత్తీర్ణులైన సంగతి తెలిసిందే.

జనరల్ కోర్సుల్లో మేనేజ్‌మెంట్లవారీగా ఫలితాలిలా..

- ఏపీ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీల విభాగంలో 137 మందికి గాను 68.61 శాతం ఉత్తీర్ణతతో 94 మంది పాసయ్యారు.
- ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ విభాగంలో 41 మందికి 39.02 శాతం ఉత్తీర్ణతతో 16 మంది ఉత్తీర్ణులయ్యారు.
- బీసీ (ఎంజేపీఏపీబీసీడబ్ల్యు) రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ విభాగంలో ఇద్దరు పరీక్షకు హాజరై ఇద్దరూ పాసయ్యారు.
- సహకార జూనియర్ కాలేజీల విభాగంలో 158 మందికి గాను 31.01 శాతం ఉత్తీర్ణతతో 49 మంది పాసయ్యారు.
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల విభాగంలో 2371 మంది పరీక్ష రాయగా 42.35 శాతం ఉత్తీర్ణతతో 1004 మంది ఉత్తీర్ణత సాధించారు.
- హైస్కూల్ ప్లస్ విభాగంలో హరిపురం, రొట్టవలస, వజ్రపుకొత్తూరు, నరసన్నపేట, బ్రాహ్మణతర్ల, టెక్కలి కాలేజీల నుంచి 116 మందికి గాను 34.48 శాతం ఉత్తీర్ణతతో 40 మంది పాసయ్యారు.
- కేజీబీవీ జూనియర్ కాలేజ్‌ల విభాగంలో 216 మందికి గాను 72.22 శాతం ఉత్తీర్ణతతో 156 మంది పాసయ్యారు.
- ఏపీ మోడల్ స్కూల్ కాలేజ్ విభాగంలో 369 మందికి గాను 53.93 శాతం ఉత్తీర్ణతతో 199 మంది ఉత్తీర్ణులయ్యారు.
- ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కాలేజ్ విభాగంలో 3703 మందికి గాను 40.16 శాతం ఉత్తీర్ణతతో 1487 మంది పాసయ్యారు.

క్లుప్తంగా

పెండింగ్ కేసులపై దృష్టి


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

సరుబుజ్జిలి: సమాజంలో డ్రగ్స్, గంజాయి వినియోగం అరికట్టే దిశగా సిబ్బంది పని చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి, ఆమదాలవలస సీఐ దివాకర్ వాయునందన్, ఎస్సై నిహార్, సిబ్బంది పాల్గొన్నారు.

1న అంబేడ్కర్ వర్సిటీలో ధర్నా


నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జూలై 1న ధర్నా నిర్వహించనున్నట్లు దళిత సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎచ్చెర్లలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. వర్సిటీలో అక్రమాలు జరిగాయని, పూర్వపు వీసీ నిమ్మ వెంకటరావు అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత వీసీ అసమర్థ పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు టొంపల రమణ, దుర్గాసి గణేష్, థండ్యాన లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నీటమునిగిన పొలాలు


గోరింటలో నీట మునిగిన వరి విత్తనాలు

పొందూరు: మండలంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు కుండపోతగా కురిసిన భారీ వర్షంతో పంట పొలాల్లో వేసిన వరి విత్తనాలు నీటమునిగాయి. తాడివలస, గోరింట, తుంగపేట తదితర గ్రామాల్లో రెండు రోజులుగా ముమ్మరంగా వరి విత్తనాలు జల్లారు. బుధవారం కుర్షిన వర్షానికి పొలాలు గట్లు కొట్టుకుపోగా విత్తనాలు నీటి పాలయ్యాయి. మరికొన్ని చోట్ల విత్తనాలు తేలిపోయిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి విత్తనాలు జల్లుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు.

అన్నదమ్ముల కొట్లాట


చికిత్స పొందుతున్న బృందావనం

కాశీబుగ్గ: మందస మండలం సరియాపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు బహడపల్లి బృందావనం, బహడపల్లి రఘు మధ్య బుధవారం రాత్రి కొట్లాట చోటుచేసుకుంది. పాతకక్షల నేపథ్యంలో రఘు తనపై కత్తితో దాడికి పాల్పడినట్లు బాధితుడు బృందావనం తెలిపారు. తలకు తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన హరిపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని, మరో ఐదేళ్ల పాటు ఏమీ చేయలేవని హెచ్చరిస్తూ, పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని దాడికి పాల్పడుతున్నాడని బాధితుడు వాపోయాడు. ఈ ఘటనపై మందస పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

• అన్నపూర్ణమ్మకు చల్లదనం


మందస మండల కేంద్రంలో బుధవారం అన్నపూర్ణమ్మ గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలంతా ముర్రాటలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అన్నపూర్ణమ్మ ఆశీస్సులు పొందారు.

- కాశీబుగ్గ

• 108 కలశాలతో అభిషేకం


సారవకోట మండలం అవలింగి గ్రామంలో విజయగణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామివారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆరుబయటకు తీసుకొచ్చి విశేష పూజలు, హోమాలు చేసినట్లు అర్చకులు జానీబాబు తెలిపారు.

- సారవకోట

• స్ఫూర్తిప్రదాతకు నివాళులు


భారత స్వాతంత్య్ర ఉద్యమాన్ని ముందుకు నడిపించి, అన్ని వర్గాల వారిని సమైక్యంగా ముందుకు నడిపించిన గేయం వందేమాతరమని, దానిని రచించిన బంకించంద్ర ఛటోపాధ్యాయను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని గాంధీమందిర కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. బుధవారం బంకించంద్ర ఛటోపాధ్యాయ జయంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

- శ్రీకాకుళం అర్బన్

యాంత్రీకరణతో అధిక దిగుబడులు

- ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రంతో సులువుగా విత్తన ప్రక్రియ
- ఒకేసారి ఎరువులు, విత్తనాలు చల్లేందుకు వీలు
- కూలీల కొరతకు చెక్


ఫెర్టి కమ్ సీడ్‌డ్రిల్ మిషన్ ద్వారా విత్తనాలు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్ : మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో లాభదాయక దిగుబడులు సాధించాలంటే వరి సాగులో యంత్రాల ఉపయోగం తప్పనిసరి. దీనిలో భాగంగా ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రాన్ని వినియోగించి వరి విత్తనాలు, ఎరువులను ఏక కాలంలోనే చల్లుకోవచ్చు. ఈ విధానం ద్వారా కూలీల కొరతను అధిగమించడమే కాకుండా రైతులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో జిల్లా వ్యాప్తంగా వరి పంటలు వేసుకునేందుకు రైతాంగం సిద్ధమయ్యింది. ఈ పరిస్థితుల్లో కూలీలు సకాలంలో అందుబాటులో లేకపోవడం, కూలీ రేట్లు ఎక్కువగా పెరగడంతో అన్నదాతలకు తలనొప్పిగా మారింది. నారుమడి నుంచి నారు తీసి దమ్ము పట్టే వరకూ రైతులంతా పంట పొలాలకే పరిమితం కావాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పొలంలో విత్తనాలు నుంచి వరినాట్లు నాటడానికి కావాల్సిన వ్యవసాయ కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటికీ ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్‌తో విత్తన సాగు పద్ధతి రైతుకు చక్కని మార్గం కానుంది.

ఎలా ఉపయోగించాలంటే..

ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ద్వారా ఎకరాకు 16 కిలోల శుద్ధిచేసిన విత్తనాలను, ఎరువులను ఒకేసారి నేరుగా చదును చేసి ఉన్న పొలంలో ట్రాక్టర్ ద్వారా చల్లుకోవచ్చు. విత్తనాన్ని ఎక్కువ శాతం లోతులో వేస్తే మొలకశాతం దెబ్బతినే అవకాశం ఉన్నందున నేల పైపొరల్లో పడేలా సుమారు 2.5 సెం.మీ నుంచి 5 సెం.మీ లోతులో విత్తనం పడేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలా విత్తితే విత్తనాలు పక్షులకు దొరకవు.

ఒకేసారి ఎరువులు, విత్తనాలు..

ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ద్వారా ఒకేసారి విత్తనాలు ఎరువులు చల్లేందుకు వెసులుబాటు ఉంది. ఈ పద్ధతిలో నీరు నిల్వ గట్టడం ఉండదు. కలుపు నివారణ సకాలంల తీసుకునే అవకాశముంటుంది. విత్తిన 48 గంటల్లోపు తగు మాత్రం తేమ ఉండేలా ఎకరాకు పెండి మిథాలిన్ 30 ఈసీ 1 లీటరు మందును గానీ, పెండి మిథాలిన్ 30 ఈసీ, 700 మి.లీ 200 మి.లీ నీటిలో గానీ కలిపి వెనుకకు నడుచుకుంటూ నేల బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలి. ఇది చేసిన వెంటనే నీటి తడి పెట్టకూడదు. విత్తిన 15-20 రోజులకు కలుపు ఉద్ధృతిని బట్టి బిస్ ఫరిబాక్ సోడియం అనే మందును ఎకరాకు 100 మి.లీ. పిచికారి చేసి కలుపు నియంత్రివచ్చు.

ఈ పంటలకు మేలు..

ఈ యంత్రం ద్వారా అన్ని రకాల నేలల్లోనూ వరి విత్తనాలతో పాటు గోధుమ, మొక్కజొన్న, నూనెగింజలు, సోయాబీన్, పప్పుధాన్యాలు, మినుములు వంటి వివిధ రకాల విత్తనాలను ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ద్వారా వెదజల్లేందుకు వెసులుబాటు ఉంది. విత్తనాలను పక్షులు తినకుండా ఉండేలా సీడ్ డ్రిల్ మిషన్ కవర్ చేస్తుంది. విత్తన సమయంలో కలుపు మొక్క లను తొలగించడంలో విత్తన కవాతులు కూడా ఎంతో ఉపయోగపడతాయి. అటు సమయాన్ని, ఇటు కూలీల సమస్యలను సైతం ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ద్వారా అధిగమించవచ్చు.

అన్ని మండలాల్లో..

ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రాలు అన్ని మండలాల్లో రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఈ యంత్రాల ద్వారా కూలీల కొరత అధిగమించవచ్చు. ఎవరికైనా ఈ డ్రిల్ కావాలనుకుంటే మండల కమ్యూనిటీ ఫెసిలిటేటర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ కిరణ్‌కుమార్, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు


పట్టాల పక్కన బాధిత యువకుడు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లభద్ర రైల్వేగేటుకు కిలోమీటరు దూరంలో రైలు నుంచి ఓ యువకుడు జారిపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. బుధవారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో అతి వేగంగా వచ్చిన షాలిమార్ సూపర్‌ఫాస్ట్ రైలు ఒంపు తిరిగే క్రమంలో అసోం రాష్ట్రానికి చెందిన ఇంద్ర బహదూర్ బోరో ఒక్కసారిగా జారిపడి వరద కాలువలో పడిపోయాడు. బాధిత యువకుడిని గుర్తించిన గ్యాంగ్‌మాన్, ఇతర ప్రయాణికులు పలాస రైల్వేస్టేషన్‌కు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి 108 అంబులెన్సు చేరుకుంది. 108 ఈఎంటీ బత్తిని తారకేష్, పైలట్ కెల్లి శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ పోలీసు, గ్యాంగ్‌మాన్‌లు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం కిలోమీటరుకు పైగా బాధితుడిని మోసుకుని వచ్చారు. అనంతరం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి విషమంగా ఉందని సమాచార.

నగిరికటకంలో భారీ చోరీ

- 20 తులాల బంగారం, రూ.50 వేలు నగదు అపహరణ


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు

జలుమూరు: మండలంలోని నగిరికటకం గ్రామంలో రేజేటి శ్రీనివాసరావు ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావు పెద్ద కుమారుడు ఫణిబాబు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అతనికి అనారోగ్యంగా ఉందన్న సమాచారం మేరకు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు ఈ నెల 21న హైదరాబాద్ వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం 11 గంటలకు నగిరికటకంలోని ఇంటికి వచ్చి చూసేసరికి ఉత్తరం వైపు తలుపులు తీసి ఉండడం గమనించారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువా తాళాలు పగలుకొట్టి సుమారు 20 తులాల బంగార ఆభరణాలు, రూ.50 వేల నగదును దుండగులు అపహరించుకుపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ మధుసూదనరావు, శ్రీకాకుళం క్లూస్ టీమ్ ఎస్‌ఐ భరత్ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ బడిలో ఎంఈఓ పిల్లలు

- ఆదర్శంగా నిలిచిన కొత్తూరు మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు


కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కుమారుడిని చేర్పించిన ఎంఈఓ


పారాపురం ప్రాథమిక పాఠశాలలో కుమార్తెను చేర్పించిన ఎంఈఓ

కొత్తూరు: మండల విద్యాశాఖాధికారి ఎన్.శ్రీనివాసరావు తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. అత్యుత్తమ బోధన సిబ్బంది, మౌలిక సదుపాయాలు, సరికొత్త బోధన పద్ధతులు, విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడంతో తన కుమారుడు హృతికేశ సాయిని బుధవారం కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతిలో చేర్పించారు. కుమార్తెను పారాపురం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతిలో చేర్పించి స్ఫూర్తిగా నిలిచారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎంఈఓ శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు గోవిందరావు, చంద్రకాంత్ కోరారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కంచిలి: మండలంలోని పెద్దంపురం గ్రామానికి చెందిన ఏదూరి పురుషోత్తం(37) కనిపించడం లేదని సోదరుడు ఢిల్లీరావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్యతో కొన్నాళ్లుగా వివాదం ఏర్పడి వేరుగా ఉంటున్నారని, ఇటీవల పెద్దలు సమక్షంలో చర్చలు జరిగాయని, ఈ క్రమంలో పురుషోత్తం అదృశ్యమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

యాంత్రీకరణ సాగుపై అవగాహన


విత్తనం, ఎరువు ఒకేసారి వేసే యంత్రం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస: వ్యవసాయ సేద్యంలో యాంత్రికరణతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కె.వి.కె.శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని కృష్ణాపురంలో ఎరువు, విత్తనం ఒకేసారి వేసే యంత్రాన్ని రైతులకు చూపిస్తూ వెదజల్లే పద్ధతిపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1,50,000 ఎకరాలలో వరి సాగవుతుందని, అందులో 50 నుంచి 60 శాతం వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారని చెప్పారు. ఈ యంత్రంతో ఒకేసారి విత్తనం, ఎరువులు వేయవచ్చన్నారు. విత్తన మోతాదు 50 శాతం వరకు తగ్గుతుందని, నీటిని ఆదా చేసుకోవచ్చని తెలిపారు. చీడపీడల సమస్య కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, డాక్టర్ ఎస్.అనూష, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ అనంత్, రైతులు పాల్గొన్నారు.

రీసర్వే భూముల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమార్

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ రెవెన్యూ గ్రూపులో ఇటీవల జరిగిన రీ సర్వేలో పలు అక్రమాలు జరిగినట్లు జిల్లా కలెక్టర్, టెక్కలి సబ్ కలెక్టర్‌లకు పలువురు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ బుధవారం కర్లెమ్మ రెవెన్యూ పరిధిలోని సంబంధిత భూములను పరిశీలించారు. విద్యుత్ సబ్ స్టేషన్, పాఠశాలకు చెందిన ఖాళీ స్థలం, మరో చోట దేవదాయ భూమిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా జిరాయితీ భూములుగా రీ సర్వే అధికారులు మార్చినట్లు సబ్ కలెక్టర్ గుర్తించారు. జిరాయితీగా మార్చిన అత్యంత విలువైన ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మాణం చేస్తున్నట్లు గమనించి రెవెన్యూ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఇల్లు నిర్మాణాలు నిలుదపుదల చేయడంతో ఇటీవల ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.వి.వి.ప్రసాదరావు, రీ సర్వే డీటీ అనంతరావు, డీఐ జనార్దనావు, డీటీ సత్యనారాయణ, ఎంఎస్ రమణయ్య, వీఆర్వో రాము, విలేజ్ సర్వేయర్ గిరి, పంచాయతీ కార్యదర్శి రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

39 కేజీల గంజాయి పట్టివేత

కాశీబుగ్గ:


స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్‌పీ పోలీసులు

పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం అక్రమంగా తరలిస్తున్న 39 కేజీల గంజాయిని జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు రెండు కేజీల చొప్పున 19 ప్యాకెట్లతో గంజాయిని తరలించేందుకు కొందరు సిద్ధమయ్యారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి మహారాష్ట్రకు చెందిన జుబిర్ నజీర్ సయ్యద్, శ్యామ్‌లకు పట్టుకున్నారు. అరెస్టు చేసి కేసు నమోదు చేసి విశాఖపట్నం రైల్వేకోర్టుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. విశాఖ లైన్స్ సీఐ కె.వెంకటరావు, ఓపీ ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు, పలాస జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

కాశీబుగ్గ:


లక్ష్మిని పరామర్శిస్తున్న నాయకులు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పద్మనాభపురం వద్ద ఓ భవననిర్మాణ కార్మికురాలికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. వంకల లక్ష్మి అనే కార్మికురాలు కాంక్రీటు మిల్లర్‌కు చీర తగిలి యంత్రం లోపలకు వెళ్లిపోయే క్రమంలో ఇతర కార్మికులు సకాలంలో స్పందించి కాపాడారు. అప్పటికే గాయాలు కావడంతో ప్రభుత్వ కిడ్నీ ఆసుపత్రిలోని అత్యవసర విభాగానికి తరలించి వైద్యసేవలు అందించారు. బాధితురాలిని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు, నాయకులు సూర్యనారాయణరావు పరామర్శించారు.

రాజీనామాలు చేయాలంటూ హెచ్చరికలు!

ఎచ్చెర్ల క్యాంపస్: యూనివర్సిటీల్లో కొన్ని పోస్టులకు మూడేళ్ల టెర్మ్, మరికొన్ని పోస్టులకు ఏడాది, ఉన్నతాధికారి ఇష్టం మేరకు రెన్యువల్‌కు అవకాశాలు ఉంటాయి. అయితే ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కీలకమైన పదవిలో ఉన్న ఓ వ్యక్తి బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు పూర్తికాకముందే గౌరవంగా వెళ్లిపోవాలని హెచ్చరికలు వస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వర్సిటీలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

అనుకూలమైన వారి కోసమేనా..

గతంలో ప్రభుత్వాలు మారినా టెర్మ్ పూర్తిచేసే సంప్రదాయాలు కొనసాగాయి. ప్రస్తుత ప్రభుత్వ మాత్రం తమకు అనుకూలమైన వారికి అవకాశాలు ఇవ్వాలని, ఉన్న వారిపై కక్ష సాధింపు చర్యలకు తెరలేపుతోంది. ఈ విధానాన్ని మేధావులు వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు స్వచ్ఛందంగా బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

రేపు శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: బలగ హాస్పిటల్ జంక్షన్‌లోని డీఎల్‌టీసీ/ప్రభుత్వ ఐటీఐ శిక్షణా సంస్థలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. టీవీఎస్ సుందరం ఫాస్టనర్స్ లిమిటెడ్, యోకోహమా, ముత్తూట్ ఫైనాన్స్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, అపోలో ఫార్మా, నవతా ట్రాన్స్‌పోర్ట్, బ్లూస్టార్, ఏషియన్ ఆటో పార్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం, కికువ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ వంటి 11 కంపెనీల్లో 481 పోస్టుల ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగి టెన్త్, ఇంటర్, ఫార్మసీ, ఐటీఐ, డిగ్రీ, తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులు/ఫెయిలైన విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు.